సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025





విశాఖ సిటీ: ఏయూలో బీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మణికంఠ మృతి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఏయూ ఆరోగ్య కేంద్రం, **అంబులెన్స్** సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మణికంఠ మరణించాడంటూ విద్యార్థులు ఏయూ ప్రధాన గేట్, వీసీ చాంబర్ వద్ద ఆందోళనకు దిగారు. మణికంఠ **మృతికి సమా**ధానం చెప్పాలని, కుటుంబ సభ్యులకు రూ.కోటి పరిహారం ఇప్పించాలంటూ వీసీ చాంబర్‌లోకి దూసుకెళ్లారు. ఏయూ పాలకులకు వ్య**తిరేకంగా** నినాదాలు చేశారు. విద్యార్థులు సాయంత్రం వరకూ వీసీ ఆఫీస్ వద్దే ఉండి, మణికంఠ చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి సంతాపం **తెలిపారు.**

వసూలు చేసిన రూ.2 లక్షలు వెనక్కి!



- **తన పేరు చెప్పొద్దంటూ వేడు**కోలు?
- **ఫిర్యాదుదారు బంధువు పో**లీసు అధికారి ద్వారా రాయబారాలు!
- **రోజుకో మలుపు తిరుగుతు**న్న అనకాపల్లి స్టేషన్ ఎపిసోడ్
- **లోతుగా విచారణ చేపడుతు**న్న ఏసీబీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి పోలీస్ స్టేషన్‌లోనే వసూళ్ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఓ కేసులో నగదు తీసుకుంటూ ఎస్‌ఐ ఏసీబీకి చిక్కగా... స్టేషన్‌లో తీసుకున్న రూ.2 లక్షలు కాస్తా ఎవరి జేబులోకి వెళ్లాయనే కోణంలో ఏసీబీ విచారణ చేపట్టింది. ఇందుకోసం స్టేషన్ సీసీ ఫుటేజీని ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు.. అంతిమ లబ్ధిదారు ఎవరనే కోణంలో విచారణ ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. అయితే రూ.2 లక్షల వ్యవహారం బయటపొక్కకుండా ఉండేందుకుగానూ.. తన జేబులోకి వేసుకున్న వ్యక్తి కాస్తా తిరిగి ఫిర్యాదుదారుడికి వెనక్కి ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా సదరు ఫిర్యాదుదారుడికి దూరపు బంధువైన ఓ పోలీసు అధికారి ద్వారా రాయబారం నడుపుతున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. తనకు రూ.2 లక్షలు ఇచ్చినట్టు చెప్పవద్దంటూ బతిమలాడుకుంటున్నట్టు సమాచారం. మరోవైపు ఏసీబీ కేసులో అరెస్టయి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన ఎస్‌ఐ కాస్తా... తిరిగి త్వరలోనే తనకు లా అండ్ ఆర్డర్ పోస్టింగు వస్తుందంటూ ప్రచారం చేసుకుంటుండటం ఇప్పుడు అనకాపల్లిలో హాట్‌టాపిక్‌గా మారింది.

పేరు చెప్పొద్దు ప్లీజ్..!

వాస్తవానికి ఈ కేసు వ్యవహారంలో ఎంత మొత్తం తీసుకోవాలనే డైరెక్షన్ మొత్తం ఎస్‌ఐ వెనుక ఉండి 'విజయ'వంతంగా నడిపించిన వ్యక్తి ఇప్పుడు తన పేరు బయటకు రాకుండా జాగ్రత్తలో పడినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా ఫిర్యాదుదారుడితో రాయబారాలు నడిపినట్టు కూడా సమాచారం. ఈ వ్యవహారంలో తనకు సహాయంగా ఉండేందుకు సదరు ఫిర్యాదుదారుడికి దూరపు బంధువైన ఓ సీఐ సహాయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకుగానూ రూ.2 లక్షలు వెనక్కి ఇవ్వడంతో పాటు నమోదైన కేసు వ్యవహారంలోనూ సహాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఏసీబీకి ఇచ్చిన ఫిర్యాదులో ఇప్పటికే రూ.2 లక్షలు అందజేసినట్టు స్పష్టంగా పేర్కొన్న ఫిర్యాదుదారుడు.. అంతిమంగా ఎవరికోసం ఇచ్చారనేది ఇప్పటి వరకు వెల్లడించలేదని తెలుస్తోంది. ఇదే అదునుగా తన పేరు చెప్పకుండా ఉండాలంటూ తీసుకున్న రూ.2 లక్షలు తిరిగి వెనక్కి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయం బయటకు రాకుండా నగదు రూపంలో సదరు బంధువు ద్వారా లావాదేవీలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని కూడా ఏసీబీ లోతుగా విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది.

ఎమ్మెల్యే బంధువని తెలిసినా..!

వాస్తవానికి బంగారం షాపు యజమాని స్థానిక ఎమ్మెల్యే బంధువు అని తెలుస్తోంది. తన షాపులోనికి రంధ్రం చేసుకుని వచ్చేందుకు ప్రయత్నించారని.. స్వయంగా సదరు బంధువు వెళ్లి కేసు నమోదు చేయాలంటూ కోరారు. అయితే దొంగతనం ఏమీ జరగలేదు కదా అంటూ.. వెంటనే కేసు నమోదు చేయకుండా తాత్సారం చేసినట్టు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే అల్లుడు కూడా ఫోన్ చేసి విచారణ చేయాలంటూ కోరినట్టు సమాచారం. అయినప్పటికీ అవతలి పార్టీ నుంచి లంచం తీసుకుని తాత్సారం చేసినట్టు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే బంధువు వ్యవహారంలోనే పోలీసులు ఇంత ఉదాసీనంగా కేసు పెట్టకుండా అవతలి వ్యక్తుల నుంచి పైసలు తీసుకున్నారంటే పోలీసింగ్ పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా ఏసీబీ కేసులో ఇరుక్కున్న ఎస్‌ఐ తనకు తిరిగి లా అండ్ ఆర్డర్‌లో పోస్టింగు వస్తుందంటూ.. ఇందుకోసం సిటీలోని ఓ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే తనకు అండదండలందిస్తున్నట్టు కూడా ప్రచారం చేసుకుంటుండడం గమనార్హం.

ఆక్సిజన్ పెట్టేవారే లేరు

- **అందువల్లే బీఈడీ విద్యార్థి మృతి ?**
- **ఏయూ ఆరోగ్య కేంద్రానికి సుస్తీ**
- **వైద్యులు, సిబ్బంది లేక రోగుల అవస్థలు**
- **నిత్యం 200 మంది రోగులకు** ఇద్దరే వైద్యులు
- 24 గంటల డిస్పెన్సరీకి ఇద్దరు నర్సులు, ఇద్దరు ఫార్మసిస్టులు



ఏయూ ఆరోగ్య కేంద్రం



ఇవీ ఫార్మసీలో ఉన్న మందులు



అంబులెన్సులో పరిస్థితి

విశాఖ సిటీ: శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రానికి సుస్తీ చేసింది. ఏటా వేలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న వర్సిటీ.. ఉద్యోగులు, విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తోంది. ఏయూ పాలకుల నిలువెత్తు నిర్లక్ష్యం అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారింది. ఒకవైపు వందేళ్ల సంబరాలు చేసుకుంటున్న ఏయూలో డిస్పెన్సరీ 'ఊపిరి' తీసేస్తున్నారు. నిత్యం వందల మంది వచ్చే ఏయూ ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాలతో పాటు వైద్యులు, సిబ్బంది లేకపోవడం రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన వైద్య సదుపాయం లేని కారణంగానే ఏయూలో బీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మణికంఠ మరణించాడని విద్యార్థుల చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటన ఏయూ పాలకుల నిర్లక్ష్యాన్ని మరోసారి బట్టబయలు చేసింది.

200 మంది రోగులు.. ఇద్దరే వైద్యులు

ఏయూలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర, ఇతర సిబ్బంది, విద్యార్థుల కోసం ఆరోగ్య కేంద్రం ఉంది. 24 గంటల పాటు ఇక్కడ వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ ఉంటుంది. ఈ సమయంలో రోజుకు 200 మంది వరకు రోగులు వస్తుంటారు. కానీ ఇక్కడ ఉన్నది కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే. వీరిద్దరే చాలా ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నారు. మూడు షిఫ్టులు వైద్య సేవలు అందించే ఈ ఆస్పత్రిలో కేవలం ఇద్దరు నర్సులు మాత్రమే ఉన్నారు. అలాగే ఫార్మసిస్టులు ముగ్గురికి ఇద్దరు మాత్రమే ఉన్నారు. అలాగే ఒక్కో షిఫ్ట్‌లో ఒక వార్డుబాయ్ ఉంటున్నారు. వీరే మొత్తం పనిచేయాల్సి వస్తోంది. ఎవరు సెలవు పెట్టినా మిగిలిన వారిపై పనిభారం పడుతోంది. ప్రధానంగా ఆక్సిజన్ సిలిండర్లు ఆస్పత్రిలో ఒకటి, అంబులెన్సులో ఒకటి ఉన్నాయి. కానీ అంబులెన్సులో రోగిని తీసుకెళ్లడానికి సిబ్బంది వెళ్లే పరిస్థితి లేదు. రోగికి ఆక్సిజన్ పెట్టేందుకు వార్డుబాయ్ వెళితే.. ఆస్పత్రిలో రోగులకు సేవలు అందించడానికి ఎవరూ లేకుండా పోతున్నారు. ఇదే పరిస్థితి గురువారం ఎదురైంది. అస్వస్థతకు గురైన మణికంఠను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినప్పటికీ.. ఆక్సిజన్ పెట్టేందుకు సిబ్బంది లేరు. ఆక్సిజన్ పెట్టి ఉంటే మణికంఠ ప్రాణాలతో ఉండేవాడని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఇలా ఆస్పత్రిలో అనేక సమస్యలు తిష్టవేసుకొని కూర్చున్నాయి. ఇక్కడి పరిస్థితులు, అసౌకర్యాలు, సిబ్బంది లోటు వంటి విషయాలను ఏయూ పాలకుల దృష్టికి పలువురు తీసుకువెళ్లినా ఇప్పటి వరకు వాటిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.

జీతాలు అరకొరే..

ఆస్పత్రిలో సిబ్బంది జీతాల పరిస్థితి కూడా దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది. దశాబ్దానికి పైగా పనిచేస్తున్న నర్సుకు ఇక్కడ కేవలం రూ.10 వేలు మాత్రమే ఇస్తుండడం గమనార్హం. అలాగే ఫార్మసిస్టులకు రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారు. జీతాలు పెంచాలని సిబ్బంది ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారిని పట్టించుకున్న వారే లేకుండా పోయారు. ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని, సిబ్బందిని నియమించాలని గత ఏడాది కాలంగా పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివాదాల్లో ఏయూ..

ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వకళాపరిషత్‌ను ఇటీవల కాలంలో వివాదాలు చుట్టుముడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏయూ ప్రతిష్ట దిగజారుతోంది. నిత్యం ఏదో ఒక వివాదంతో ఆందోళనకు, నిరసనలకు కేంద్రంగా మారుతోంది. పాలనపై ఆరోపణలు, విద్యార్థుల వసతి సౌకర్యాలపై విమర్శలు.. పురుగుల భోజనాలతో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో ఏయూలో పరిస్థితులపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎప్పటికప్పుడు ఏయూ వీసీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతున్నారు. నిత్యం ఏదో ఒక రగడతో ఏయూలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రతిసారి ఆందోళనల సమయాల్లో బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు తప్ప సమస్యలను పరిష్కరించడం లేదని విద్యార్థులు మండిపడ్డారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

నేటి నుంచి దశల వారీ ఆందోళన

మహారాణిపేట: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలం కావడంతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పీహెచ్‌సీ) పనిచేస్తున్న వైద్యులు శుక్రవారం నుంచి విధులు బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సమ్మెకు దిగుతున్నట్లు అసోసియేషన్ నాయకులు డాక్టర్ జగదీష్ తెలిపారు. జిల్లాలోని భీమిలి, రేవిడి, ఆర్. తాళ్లవలస, ఆనందపురం, కొంత్యాం, మధురవాడ, కణితి రోడ్డు, దేవాడ, గాజువాక, పెదగంట్యాడ తదితర పది పీహెచ్‌సీలలో పనిచేస్తున్న సుమారు 20 మంది వైద్యులు ఈ ఆందోళనలో పాల్గొంటున్నారు. తమ డిమాండ్లను ఈ నెల 25వ తేదీలోగా పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ నాయకులు ఇప్పటికే ఈ నెల 19న పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు, 23న డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావుకు సమ్మె నోటీసులు అందజేశామన్నారు.

ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మె తప్పడం లేదని డాక్టర్ జగదీష్ స్పష్టం చేశారు. శుక్రవారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామని, నవంబర్ మూడో తేదీన విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని పేర్కొన్నారు.

జీవీఎంసీ జోన్ల సంఖ్య పెంపు

8 నుంచి 10 జోన్లగా మార్పు

డాబాగార్డెన్స్ : గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జోన్ల పునర్వ్యవస్థీకరణకు ఆమోదం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న 8 జోన్‌లను 10 జోన్‌లుగా మార్పు చేసి వాటి వివరాలను ప్రకటించింది. ఆయా జోనల్ పరిధిలో వచ్చే వార్డులను కూడా తెలియజేసింది. జోన్-2, జోన్-9 పేర్లను స్థానిక గ్రామాల పేర్ల ఆధారంగా సవరిస్తూ భీమిలి-2 స్థానంలో మధురవాడ జోన్, పెందుర్తి-2 స్థానంలో అగనంపూడి జోన్‌గా నిర్ణయించింది. ఇకపై జీవీఎంసీ పరిధిలో భీమునిపట్నం, మధురవాడ, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, పెందుర్తి, గాజువాక, అగనంపూడి, అనకాపల్లి జోన్లు ఉంటాయని తెలిపింది. జీవీఎంసీలో సిబ్బందిని ఆయా జోన్‌ల్లో సర్దుబాటు చేయాలని పేర్కొంది. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం ఉన్నతాధికారులతో సమావేశమై నూతన జోన్లకు కావాల్సిన కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పరిపాలన సౌలభ్యం.. పారదర్శకత

ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో 8 జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో 8 నుంచి 15 వార్డులు వరకు ఉన్నాయి. ఒక్కో జోన్ రెండు, మూడు నియోజకవర్గాలకు విస్తరించి ఉంది. దీంతో పరిపాలన సక్రమంగా ఉండడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విధానాన్ని మార్పు చేయాలని దీర్ఘకాలంగా డిమాండ్ ఉంది. గత కౌన్సిల్ సమావేశంలో జోనల్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించగా 10 జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల పరిపాలన సౌలభ్యం, పారదర్శకతకు అవకాశం ఏర్పడనుంది. అలాగే ఒక నియోజకవర్గంలో ఉన్న వార్డులన్నీ ఒకే జోన్ పరిధిలోకి రానున్నాయి.

పునర్ వ్యవస్థీకరణ ఇలా..

క్రమ సంఖ్య	జోన్ పేరు	వార్డులు	మొత్తం విస్తీర్ణం (చ.కి.మీ)
1	భీమునిపట్నం జోన్	1, 2, 3, 4	58.884
2	మధురవాడ జోన్	5, 6, 7, 8, 98	95.668
3	తూర్పు జోన్	9, 10, 11, 12, 13, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 28	48.527
4	ఉత్తర జోన్	14, 24, 25, 26, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 53, 54, 55	19.928
5	దక్షిణ జోన్	27, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 41	9.698
6	పశ్చిమ జోన్	40, 52, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 89, 90, 91, 92	72.937
7	పెందుర్తి జోన్	88, 93, 94, 95, 96, 97	75.038
8	గాజువాక జోన్	64, 65, 66, 67, 68, 69, 70, 71, 72, 73, 74, 75, 76, 86, 87	108.115
9	అగనంపూడి జోన్	77, 78, 79, 85	102.83
10	అనకాపల్లి జోన్	80, 81, 82, 83, 84	41.079

ఏసీబీకి చిక్కిన సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్

- సర్వే నెంబర్ మార్పు కోసం రూ.30 వేలు డిమాండ్
- నగదు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

మల్కాపురం : ఓ ఇంటి సర్వే నెంబర్ మార్పు కోసం రూ.30 వేలు లంచం తీసుకుంటున్న సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములగాడ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా రంగోలి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్‌గా కర్రి నగేష్ పనిచేస్తున్నారు. ములగాడ మండల పరిధిలో బొడ్డేపల్లి రవితేజ అనే వ్యక్తి ఇంటికి సంబంధించి సర్వే నెంబర్ తప్పుగా వచ్చింది. దీంతో అతడు తన సర్వే నెంబర్ సరిచేయాలని ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్ ఇటీవల రవితేజ ఇంటికి వెళ్లి సర్వే చేశారు. సర్వే సర్టిఫికెట్ (ఎండార్స్‌మెంట్ సర్టిఫికెట్) కావాలంటే రూ.30 వేలు అవుతుందని డిమాండ్ చేశారు. ఆ డబ్బును ఇచ్చేందుకు పంజాబ్ దాబా జంక్షన్ వద్ద గల సచివాలయానికి రావాలని చెప్పారు. ఈక్రమంలో రవితేజ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం సాయంత్రం అతడు పంజాబ్ జంక్షన్ వద్ద సచివాలయానికి వెళ్లి జూనియర్ అసిస్టెంట్ నగేష్, సర్వేయర్ సత్యనారాయణకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ములగాడ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులు సర్వేయర్ రూమ్‌లో ఫైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో శుక్రవారం హాజరుపరచనున్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ నగేష్

ప్రశాంతంగా దసరా వేడుకలు జరగాలి


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగరంలో ప్రశాంత వాతావరణంలో విజయ దశమి వేడుకలు జరిగేలా చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లపై నిఘా పెట్టాలని చెప్పారు. నగరం నుంచి గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా జరగకుండా పూర్తిగా నిరోధించాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తిగా నివారించాలని, నిర్మానుష్య, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పికెట్, అవసరం మేరకు డికాయ్ టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటివి చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ-2 డి.మేరీ ప్రశాంతి, డీసీపీ (క్రైమ్స్) లతా మాధురి, డీసీపీ(అడ్మిన్) కృష్ణ కాంత్ పటేల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అదుర్స్

ఘనంగా ముగిసిన నర్సింగ్ విద్యార్థుల సమ్మేళనం

ఏయూక్యాంపస్: నిత్యం తెల్లని యూనిఫాంలో కనిపించే నర్సింగ్ విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్లో జరిగిన 31వ ఎస్ఎన్ఏఐ ద్వైవార్షిక రాష్ట్ర స్థాయి సదస్సులో సందడి చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు పుస్తకాలకు, ప్రాక్టికల్స్‌కు కాస్త విరామం ఇచ్చి, రంగు రంగుల దుస్తుల్లో ఆట పాటలతో, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు.'లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో - జర్నీ ఆఫ్ ఏ నర్సింగ్ స్టూడెంట్' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ రెండు రోజుల కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొన్నారు.

టీఎన్ఏఐ ఏపీ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్. సంషీర్ బేగం మాట్లాడుతూ విద్యార్థుల భాగస్వామ్యం, సమన్వయం సదస్సును విజయవంతం అయిందని, వారి సహజ నైపుణ్యాల ప్రదర్శన అభినందనీయమని కొనియాడారు. సంస్థ కార్యదర్శి, ఏపీ ఎస్ఎంసీ రిజిస్ట్రార్ ఆచార్య కె. సుశీల మాట్లాడుతూ, నిత్యం చదువులతో గడిపే నర్సింగ్ విద్యార్థులకు ఈ క్రీడలు, సాంస్కృతిక పోటీలు మంచి ఆటవిడుపునిచ్చాయన్నారు. క్రీడా స్ఫూర్తితో పాల్గొన్న యువత భవిష్యత్ తరాల నాయకత్వానికి వారసులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మిస్ నర్సింగ్ విజేతగా ఎస్తేర్ ఎం. డేవిస్, మిస్టర్ నర్సింగ్ విజేతగా జిబిన్ బిజు నిలిచారు.రంగోలీ, పేపర్ ప్రజెంటేషన్, ఏకపాత్రాభినయం, బృంద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు, క్రీడల పోటీల విజేతలకు బహుమతులను, జ్ఞాపికలను ప్రదానం చేశారు.టిఎన్ఏఐ ఏపీ సలహాదారు డాక్టర్ సత్యవల్లి అసోసియేషన్ తరఫున అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె. ఝాన్సీ లక్ష్మీబాయి, డి. ఉష పన్నగ వేణి, డాక్టర్ టి. అన్నమ్మ, ఆచార్య బి. అనంతమ్మ, కె.వి శ్రీదేవి, జె. లీల, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్ పర్సన్ ప్రీతం లూక్స్, కో చైర్ పర్సన్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మిస్ నర్సింగ్‌గా ఎంపికైన ఎస్తేర్ దేవిస్‌ను సత్కరిస్తున్న డాక్టర్ షంషీర్ బేగం, త్రో బాల్‌లో పోటీలో విద్యార్థినులు

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికావు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సాక్షి, విశాఖపట్నం: ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన తీరుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాలకృష్ణ ప్రవర్తన 'మానసిక అస్థిరత్వానికి నిదర్శనం'గా అభివర్ణించారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడిన కేకే రాజు, అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురించి బాలకృష్ణ మాట్లాడిన భాష, ప్రవర్తనపై తీవ్ర విమర్శలు చేశారు. శాసనసభలో సభా సంప్రదాయాలను పాటించకుండా, సినిమా షూటింగ్‌లో ఉన్నట్లుగా నెత్తిమీద కళ్లజోడు పెట్టుకుని, జేబుల్లో చేతులు పెట్టుకుని మాట్లాడి అసెంబ్లీ గౌరవాన్ని బాలకృష్ణ దెబ్బతీశారని ఆరోపించారు. అధికారం ఉందనే అహంకారంతో ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేకే రాజు హెచ్చరించారు. బాలకృష్ణ పిచ్చి చేష్టలు, మాట్లాడే తీరును గమనిస్తే దాన్నే 'సైకో ఇజం' అంటారన్నారు. బాలకృష్ణ మాట్లాడుతున్నప్పుడు స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి 'వెరీగుడ్' అనడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలపై బాలకృష్ణ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చిరంజీవిపై బాలకృష్ణ 'వాడు', 'వీడు' అని మాట్లాడటాన్ని ప్రస్తావిస్తూ, ఇది చిరంజీవిపై ఆయనకున్న అసూయను వెళ్లగక్కడమేనని కేకే రాజు ఆరోపించారు.

కేజీహెచ్‌లో సీబీఐ అధికారుల విచారణ

- విద్యార్థిని రీతి సాహా మృతి కేసులో కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు ప్రారంభం
- హాస్టల్ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందిన రీతి సాహా
- ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన తల్లిదండ్రులు
- సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దినేష్‌కుమార్ నేతృత్వంలో నిపుణుల కమిటీతో భేటీ


కేజీహెచ్‌లో విచారణ అనంతరం వెళ్తున్న సీబీఐ డీఎస్పీ దినేష్ కుమార్

మహారాణిపేట : విశాఖలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన పశ్చిమ బెంగాల్ విద్యార్థిని రీతి సాహా కేసుపై సీబీఐ ఆరా తీస్తోంది. గురువారం సీబీఐ డీఎస్పీ దినేషకుమార్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో విచారణ చేశారు. అనుమానాస్పద మృతి చెందడంతో అప్పట్లో నిపుణుల కమిటీ వేసి వారి చేత పోస్టుమార్టమ్ నిర్వహించారు. అప్పుడు కమిటీ సభ్యులు డాక్టర్ మమత, డాక్టర్ హయగ్రీవరావు, డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రజనీకాంతరావులు పోస్టుమార్టం జరిపారు. ఇందులో ఇద్దరు వైద్యులు మమత, రజనీకాంతరావులకు ఇటీవల బదిలీ అయ్యింది. మిగిలిన ముగ్గురు వైద్యులను గురువారం దినేష్‌కుమార్ విచారించారు. రికార్డులను, అప్పటి పోస్టుమార్టమ్ నివేదికలను పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థిని నీట్ శిక్షణ కోసం విశాఖలో ఆకాష్ బైజూస్ కాలేజీలో చేరింది. 2023, జూలై 14న రాత్రి విశాఖ 4వ పట్టణ పోలీసుస్టేషన్ పరిధి దొండపర్తిలో కాలేజీ నిర్వహిస్తున్న సాధన హాస్టల్ భవనం పైనుంచి పడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే నెల 17న మృతి చెందింది. పోలీసులు తొలుత ఆమెది ఆత్మహత్యగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని కాలేజీకి చెందిన ఇద్దరిని, హాస్టల్‌కు చెందిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. అయితే ఆమె మృతిపై తండ్రి సుఖ్‌దేవ్ సాహా మాత్రం అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసుల దర్యాప్తు తీరు సక్రమంగా లేదని, కాలేజీ యాజమాన్యంతో పోలీసులు కుమ్మక్కైపోయారని ఆరోపణలు చేశారు. అలాగే సీసీ కెమెరా పరిశీలిస్తే.. తన కుమార్తె బిల్డింగ్‌పైకి వెళ్లినపుడు ఒక కలర్ డ్రెస్ ఉందని, కింద పడిన తర్వాత మరో కలర్ డ్రెస్ ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

రంగంలోకి దిగిన సీబీఐ

అప్పట్లో విశాఖలో సంచలనం సృష్టించిన ఈ కేసులో విచారణ చేయడానికి సీబీఐ రంగంలోకి దిగింది. ఈ కేసు విషయంలో స్వయంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. దర్యాప్తు కోసం బెంగాల్ సీఐడీని విశాఖకు పంపించడం చర్చనీయాంశమైంది. తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలివ్వడంతో మరోసారి దర్యాప్తు జరుగుతోంది.

సిటీ పోలీసులకు తలనొప్పులు

విద్యార్థిని మృతి కేసు విశాఖ పోలీసుల పరువు తీసినట్టయింది. ముందు ఆమెది ఆత్మహత్యగానే పేర్కొంటూ స్వయంగా అప్పటి సీపీ త్రివిక్రమ్ వర్మ మీడియా సమావేశంలో తేల్చి చెప్పారు. బెంగాల్ నుంచి సీఐడీ దర్యాప్తు చేపట్టిన తర్వాత అప్పటికప్పుడు సెక్షన్లు మార్చారు. దర్యాప్తు అధికారిని తప్పించి ఉన్నతాధికారికి ఆ బాధ్యతలు అప్పగించారు. అలాగే సీఐ, ఎస్ఐలపై బదిలీ వేటు వేశారు. ఇపుడు మళ్లీ అప్పటి పోలీసుల వ్యవహార శైలిపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయన్న చర్చ పోలీస్ శాఖలోనే జరుగుతోంది.

ఈపీడీసీఎల్‌తో ఫ్లూయెంట్‌గ్రిడ్, సీసీఎఫ్ ఒప్పందాలు

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ సరఫరాలో నాణ్యత, వ్యవస్థలో ఆధునికీకరణ, ఎనర్జీ ట్రాన్సిషన్ మరింత వేగవంతం చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ సరికొత్త ఒప్పందాలు చేసుకుంది. సాగర్‌నగర్‌లోని ఈసీబీసీ భవనంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీవోఈఈటీ) కోసం ఫ్లూయెంట్‌గ్రిడ్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ (సీసీఎఫ్) సంస్థలు ఏపీఈపీడీసీఎల్‌తో గురువారం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ ఆధునికీకరణ, కర్బన ఉద్గారాల నియంత్రణే లక్ష్యంగా కొత్త స్టార్టప్‌లను గుర్తించడం, ప్రోత్సహించడం ఈ ఎంవోయూల ద్వారా నిర్వహించనున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌లో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ గ్రిడ్ ల్యాబ్‌లో ఏఐ ఆధారిత పరిష్కారాలను పరీక్షించి, మెరుగులద్దనున్నారు. యునెజా, గ్రెయిల్ వంటి అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల సహాయంతో నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సంయుక్త పరిశోధన పత్రాల ప్రచురణకు తోడ్పడుతుంది. అదేవిధంగా విశాఖ ఎనర్జీ సమ్మిట్ వంటి ప్రతిష్టాత్మక ఈవెంట్లను నిర్వహిస్తూ, పరిశ్రమ నేతలు, స్టార్టప్‌లు, నిపుణుల ప్యానెల్ చర్చలు, ఉద్యోగ-నైపుణ్య మేళాలు ఈ సంస్థల సహకారంతో ఈపీడీసీఎల్ ఏర్పాటు చేస్తుంది. ఫ్లూయెంట్‌గ్రిడ్ ఎంవోయూలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌లో స్మార్ట్ గ్రిడ్ కమాండ్-కంట్రోల్ సెంటర్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా స్థాపించనుంది. ఏఐ ఆధారిత యాక్టిలిజెన్స్ గ్రిడ్ మోడరనైజషన్ ప్లాట్‌ఫామ్‌ను వినియోగించి సైడీ, సైఫీ అంచనాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు నిర్వహణ, డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ రిసోర్స్ మేనేజ్మెంట్, రియల్‌టైమ్ డేటా యాక్సెస్‌కు ఏఐ అసిస్టెంట్ వంటి వినూత్న పరిష్కారాలను ప్రదర్శిస్తుంది. విపత్తు నిర్వహణలో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల గుర్తింపు, వాటికి అనుగుణంగా నెట్‌వర్క్‌ను పటిష్టపరిచేందుకు సూచనలు అందించనుంది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూ కొత్తగా కుదుర్చుకున్న ఎంవోయూలు పునరుత్పాదక ఇంధన రంగం, ఎనర్జీ ట్రాన్సిషన్‌లో జాతీయస్థాయిలో ప్రముఖ పాత్ర పోషించేందుకు తోడ్పతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.


క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ ప్రతినిధులతో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

ఏఈవో ఆనంద్‌కుమార్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా పనిచేసి ప్రస్తుతం కనకమహాలక్ష్మి దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.ఆనంద్‌కుమార్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఉపలోకాయుక్త ఆదేశించింది. సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్టబోర్డు సభ్యుడు దొడ్డి రమణ ఫిర్యాదు మేరకు గత నెల 19న లోకాయుక్త ఆదేశాలు జారీచేసింది. సింహాచలం దేవస్థానంలో ఏఈవోగా పనిచేసిన కాలంలో ఆరోపణలపై సంబంధిత శాఖ అధికారులు విచారణ చేయాలని ఉప లోకాయుక్త ఆదేశించింది. దొడ్డి రమణ ఫిర్యాదును దేవదాయశాఖ కమిషనర్‌కు పంపింది. దేవస్థానంలో ఆనంద్‌కుమార్ ఎక్కువగా భూపరిరక్షణ విభాగంలోను, ఆలయంలో సూపరింటెండెంట్‌గా, ఏఈవోగా విధులు నిర్వర్తించారు. భూపరిరక్షణ విభాగంలో పనిచేసిన కాలంలో అనేక అవకతవకలకు పాల్పడ్డారని అప్పట్లో ఆరోపణలు చోటుచేసుకున్నాయి. ఇటీవల ఆలయ ఏఈవోగా పనిచేసిన కాలంలోకూడా ఆయన వ్యవహార తీరుపై ఆరోపణలు వెల్లువెత్తాయి.

కలెక్టరేట్‌లో స్వచ్ఛోత్సవ్

మహారాణిపేట: స్వచ్ఛోత్సవ్‌లో భాగంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లాలో 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాథ్ ' పేరుతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టి, పరిసరాలను శుభ్రం చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎస్. హరేందిర ప్రసాద్ పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్, కలెక్టరేట్ ఏవో బీ.వీ.రాణి, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొని పరిశుభ్రతా చర్యలు చేపట్టారు.

లడ్డూ విక్రయాల నిలిపివేత

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో లడ్డూ విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా లడ్డు విక్రయాలు నిలిపివేస్తున్నామని, భక్తులు దీనిని గమనించాలని కోరారు.

ముగ్గురు జీవీఎంసీ సిబ్బందిపై వేటు

మధురవాడ: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఇన్‌చార్జ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌తో సహా మరో ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలపై సస్పెన్షన్ వేటు పడింది. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అప్పలసూరి, ప్లానింగ్ సెక్రటరీలు అశోక్, రమేష్‌పై జీవీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. జీవీఎంసీ 6వ వార్డు డి మార్ట్ వద్ద, మరో చోట అనధికారంగా నిర్మాణం చేస్తున్నా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీరిపై అధికారులు చర్యలు చేపట్టారు.

జూలో అభివృద్ధి పనులకు ఈ-టెండర్లు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో రూ. 41.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం ఈ-టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఈ నిధులతో ముఖ్యంగా నక్కలు డే క్రాల్ , తోడేళ్ల డే క్రాల్ పునర్నిర్మాణం, ఎలుగుబంట్లు ఎన్‌క్లోజరు, పంప్ హౌస్‌కు మరమ్మతులు, అలాగే జూ లోపల టి-జంక్షన్ నుంచి డక్ యావరీ వరకు ఉన్న ఎన్‌క్లోజర్ల వద్ద పాత్‌వేల నిర్మాణం వంటి పనులు జరగనున్నాయి.ఈ పనుల కోసం ఈ-టెండర్లు దాఖలు చేయడానికి అక్టోబర్ 20 వరకు గడువు ఉంది. ఆసక్తి గల కాంట్రాక్టర్లు , సంస్థలు జూ పని వేళల్లో క్యూరేటర్ కార్యాలయాన్ని సందర్శించవచ్చు ..లేదా 9440168997 నంబరును సంప్రదించవచ్చన్నారు.

ధాన్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం కనకమహాలక్ష్మి దాన్యలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లడ్డూలతో సహస్రనామార్చన నిర్వహించారు. అలంకరణకు నగరానికి చెందిన ఎస్.రామరవీంద్ర రూ.75వేలు చెల్లించి పూజలో కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలు లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అందజేశారు.



ఏఐ సాయంతో ట్రాఫిక్ నియంత్రణ

భవిష్యత్తు కార్యాచరణపై కలెక్టర్, సీపీలతో ఎంపీ శ్రీభరత్ సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ బాగ్చీ

మహారాణిపేట: పర్యాటకంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణను సులభతరం చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిష్కారం అవసరమని ఎంపీ ఎం. శ్రీభరత్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అనుసరించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గి, నిర్వహణ సులభమవుతుందని ఆయన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ, నిబంధనల ఉల్లంఘన, అపరాధ రుసుం వంటి అంశాలపై జీవీఎంసీ అధికారులు, వివిధ సాంకేతిక సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎంపీ శ్రీభరత్ మాట్లాడారు. సమావేశంలో ఎంపీ శ్రీభరత్‌తో పాటు కలెక్టర్ ఎం.ఎస్. హరేందిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు అందించారు. బృహస్పతి, అవిరోస్, ఆర్కడిస్, నయన్ వంటి సాంకేతిక సంస్థల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. హైదరాబాద్, బెంగళూరు, ఇండోర్, లక్నో, ఢిల్లీ వంటి నగరాల్లో అమలు చేస్తున్న సాంకేతిక విధానాలను వివరించారు. సాంకేతికత సహాయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలను నమోదు చేయడంపై ఇటీవల చేపట్టిన పైలట్ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. ఎయిర్ పోర్టు రోడ్డు, ఆర్కే బీచ్, బిర్లా జంక్షన్, పంజాబీ హోటల్, ఆర్ అండ్ బీ జంక్షన్లలో సేకరించిన నమూనాలను చూపించారు. భవిష్యత్తు ట్రాఫిక్ సమస్య, సిగ్నలింగ్ వ్యవస్థ అనుసంధానం, డ్యాష్ బోర్డు నిర్వహణ, వేగ నియంత్రణ, ట్రాఫిక్ అలర్ట్స్, పార్కింగ్ రూల్స్ వంటి అంశాలపై ప్రజెంటేషన్ చేశారు. విశాఖకు తగిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని, ప్రజల అవసరాలకు తగ్గట్టు సరైన పరిష్కార మార్గాలను చూపే సంస్థ సేవలను వినియోగించుకోవడానికి విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. అక్టోబర్ తొలి వారంలో జీవీఎంసీ నుంచి ఆర్.ఎఫ్.పి. సిద్ధం చేసి సాంకేతిక సంస్థలకు పంపించాలని అధికారులను ఆదేశించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి, అక్టోబర్ చివరి నాటికి టెండర్లను పిలవాలని జీవీఎంసీ అధికారులకు ఎంపీ సూచించారు.

'ఆపరేషన్ లంగ్స్'కు తాత్కాలిక విరామం

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర రావు

అల్లిపురం: జీవీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆపరేషన్ లంగ్స్ 2.0 ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌కు దసరా పండుగ సందర్భంగా తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఏ ప్రభాకర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర అభివృద్ధి దిశగా ఈ కార్యక్రమం జీవీఎంసీ పరిధిలో చురుగ్గా కొనసాగుతున్నప్పటికీ, దసరా వేడుకల దృష్ట్యా ఈ తొలగింపు కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విరామ సమయాన్ని ఆక్రమణదారులు సద్వినియోగం చేసుకొని, స్వయంగా తమ బడ్డీలు, దుకాణాలు తొలగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో పలువురు వ్యాపారులు బహిరంగ ప్రదేశాలలో నిబంధనలు పాటించకుండా టిఫిన్ సెంటర్లు, ఫుడ్ స్టాల్స్ , తినుబండారాల స్టాల్స్ నడుపుతూ, ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నట్లు తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్లలో జీవీఎంసీ 'షీ' టీమ్స్ ఇప్పటికే తనిఖీలు నిర్వహించగా, ఆహార పదార్థాలలో కార్సినోజెన్స్ (క్యాన్సర్ కారకాలు) ఉన్నట్లు తేలడంతో, సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. అర్హులైన విక్రయదారులను గుర్తించి, వెండర్ జోన్‌లను ఏర్పాటు చేసి, నిర్దేశిత ప్రదేశాల్లో వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు.

28న జర్నలిస్టుల దసరా సంబరాలు

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జర్నలిస్టుల దసరా సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ్ ఈ వివరాలను తెలిపారు. ఈ వేడుకలు రైల్వేన్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో ఉదయం 9 గంటలకు అల్పాహారంతో ప్రారంభమై, సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీడీప్ వంటివి జరుగుతాయని పేర్కొన్నారు. గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పత్రికల అక్రిడిటేషన్ల జారీలో నిబంధనల సవరణ కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా ఇతర మంత్రులకు ఇటీవల వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

విజిలెన్స్ అవగాహన వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

సీతంపేట: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్ అవగాహన వాక్‌థాన్, సముద్రతీర శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. తొలుత ద్వారకానగర్‌లో ఉద్యోగులు, స్వచ్ఛంద కార్యకర్తలు విజిలెన్స్ వాక్‌థాన్‌లో పాల్గొని, పాలనలో జాగ్రత్త (విజిలెన్స్), పారదర్శకత ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆర్కే బీచ్‌లో సముద్రతీర శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రధాన అధికారి ఏవీ రమణమూర్తి మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి జాగ్రత్త (విజిలెన్స్), శుభ్రత రెండూ తప్పనిసరి అని అన్నారు.

యూనియన్ బ్యాంక్ అధికారుల శ్రమదానం


స్వచ్ఛతా హీ సేవాలో పాల్గొన్న యూనియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

సీతంపేట: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం సీతమ్మధార, పాత ఆర్కే బీచ్ ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ శంకర్ హేమ్‌రామ్, రీజనల్ హెడ్ జె.సింహాచలం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17న ప్రారంభమైన ఈ కార్యక్రమం గాంధీ జయంతి రోజున ముగుస్తుందని బ్యాంక్ అధికారులు తెలిపారు.